# గృహప్రవేశం

-వాలి హిరణ్మయీదేవి

''అందమైన ఉదయాలు, స్పందించే హృదయాలు
చందనం, చంద్రకళా, సరదాలు, స్వప్నాలు
ఇన్నిటిని సమకూర్చిన పసందైన గారడీ
చటుక్కున మడతపెట్టి చేస్తాడు టెరిబుల్ ట్రాజెడీ''
తిలక్ కవిత్వం చదువుతూంటే దీపిక పెదాలపై చిరునవ్వు విరిసింది.

నిజమే అన్నీ సమకూర్చిన ఆ గారడీవాడు, ఆర్థిక సమస్యలని తనకి చుట్టపెట్టలేదూ..అనుకొంటూ

సిన్సియర్‌గా ఆలోచిస్తే ఆమెకవి పెద్ద సమస్యలు కానేకాదు-కానీ అలా అనుకొంటూ బాధపడుతూ, ఉంటుంది- ఎందుకంటే ఆమె చుట్టూ ఉన్న సర్కిల్‌లో వాళ్ళకి ఆ డబ్బు సమస్య లేకపోవటం వల్ల.

''ఓయ్ పుస్తకాల పురుగా! ఇటొచ్చి పడుకోరాదూ'' అంటూ పిలిచాడు కార్తీక్.

''మీకు నిద్రలో దొరికే ఆనందం, నాకు చదవడంలో దొరుకుతూంటే ఎందుకు రావాలి'' అంది దీపిక పంతంగా.

ఇలా వాదించుకోవడం వాళ్ళకి మామూలే. ఇదేకాదు మరోటి కూడా. అది దేవుడి విషయంలో.

దీపికకు దేవుడంటే భక్తి, సెంటిమెంట్లపట్ల అనురక్తి.

కార్తీక్‌కు అలా కాదు''మనం కష్టపడుతున్నాం-వచ్చిందేదో తింటున్నాం- మధ్యలో మీ దేవుడిదేం ప్రమేయం ఉంది'' అంటూ వాదిస్తాడు. ఐతే ఒకటి భార్యమీద తన అభిప్రాయాలని రుద్దడు. ఆమె ఇష్టాయిష్టాలను మన్నించడం వల్లే-తనకి గౌరవం ఉంటుందని గ్రహించిన వాడవటం వలన ఇమె ఇష్టాల్ని-వ్యక్తిత్వాన్ని మన్నిస్తాడు. అందుకే కార్తీక్ అంటే ఎక్కడ్లేని అభిమానం దీపికకు. అతడ్ని ఎవరేమన్నా సహించలేని మనస్తత్వం. 'భార్య కూడా ఒక మనిషే' అని గమనించని వాళ్ళనే ఎక్కువగా చూడటం వల్ల-తనపట్ల భర్త కన్పరచే ప్రేమకు పరవశిస్తుంది.

ఎటొచ్చి చిన్న అసంతృప్తి ఎక్కడంటే- కార్తీక్ ఏళ్ళ తరబడి ఒకే కంపెనీని నమ్ముకొని-అక్కడే పాతుకుపోవటం.

చిన్నవయసులోనే మంచి జాబ్‌లలో ఉన్నా-ఇంకామంచి జాబ్‌లకోసం ప్రయత్నించే వాళ్ళే తన చుట్టుపట్ల ఉండటంతో ''మీరెందుకు బెటర్ ఛాయిస్ కోసం ప్రయత్నించరు? పోనీ పార్ట్‌టైంగా మరో జాబ్ చేస్తూ ఆర్థికంగా ఓ మెట్టు పైనుండటానికి ఎందుకు ట్రై చేయరు?'' అంటూ వాదిస్తుంది.

''నాకు వచ్చేదాంతో తృప్తిపడుతున్నాను. ఇంకెందుకు వేరే ప్రయత్నాలు?'' అంటూ తేలిగ్గా కొట్టి పారేసే కార్తీక్ మీద చికాకుకల్గినా, 'ఏజ్‌బార్ అయిపోయింది. గవర్నమెంట్ ఆశ లేదు-ఇప్పుడు వేరే జాబ్‌లో చేరినా, ఇంతకంటె ఎక్కువొస్తుందన్న నమ్మకం ఏంటి' అనుకొని ఆ చికాకుని అణిచేసుకొంటుంది.

''దీపూ! ఓ గుడ్ న్యూస్'' అంటూ వచ్చాడు కార్తీక్ ఆఫీస్ నుండి.

''ఏంటబ్బా! సడెన్‌గా ఏదైనా ఇంక్రిమెంట్ ఇచ్చారా'' అడిగింది దీపిక.

''అబ్బా! ఎప్పుడూ డబ్బు గురించి తప్ప వేరే మాట్లాడవు కదా''

''అనుకోకుండా వచ్చే డబ్బుతోగాక, వేరేవాటికి కూడా ఆనందం కలుగుతుందా?'' ఆశ్చర్యంగా అడిగింది దీపిక.

''నీలాంటి మెటీరియలిస్ట్‌లకంతేలే'' జాలిగా చూస్తూ అన్నాడు కార్తీక్.

''సరే విషయం చెప్పండయితే''

''నిన్న మన ఇల్లుగలాయన దార్లో కలిసి, ఈనెల నుండి యాభైరూపాయలు అద్దెపెంచుతున్నాను. ఇష్టమైతే ఉండండి. కష్టమైతే వేరే ఇల్లు చూసుకోండి అన్నాడు.''

వెంటనే దీపిక అసహనంతో ''ఏంటీ! ఇంటద్దె పెంచి ఆర్నెల్లన్నా కాలేదు మళ్ళీ పెంచమంటాడా? ఎంతన్యాయం? ఇంటద్దె పెంచేది లేదు-ఏం చేసుకొంటారో చేసుకొమ్మని చెప్పకపోయారా'' అంది కోపంగా.

''అరె. మాట పూర్తిగా వినవేం? అద్దె పెంచకపోగా ఇలాంటి కయ్యాలు పెట్టుకొంటూ ఉంటే మనకి నీళ్ళూ, కరెంట్ లేకుండా చేసి ఇబ్బంది పెడతాడు-గోడకి మేకు కొట్టినా గొడవే-ఇంటికి చుట్టమొచ్చినా కయ్యమే-ఇవన్నీ అనుభవించనివా? చెప్పు''

''అలా అని వాళ్ళన్నదానికల్లా తలూపుతారా?''

''దీపూ! నన్ను చెప్పనిస్తావా? లేదా?'' చిరాగ్గా అన్నాడు కార్తీక్.

''ఊ. చెప్పండయితే'' అయిష్టంగా అంది దీపిక.

''ఆయన్తో ఆలోచించి చెబుతాను అన్నానే గానీ ఒకటే ఆలోచన ఎలా అని? అనుకోకుండా ఏదో టాపిక్ వచ్చి మా ప్రొప్రయిటర్‌తో చెప్పానీ విషయం. ''ఐతే ఉన్నపళంగా ఇంక్రిమెంట్ ఇవ్వాలా'' అంటూ అడిగాడాయన. అదికాదు. మీరు కొంత ఎమౌంట్ లోన్‌గా ఇస్తే మేం ఓ చిన్న ఇల్లు కట్టుకొంటాం. అద్దెకి కట్టినట్టుగా-మరికొంతవేసి మీకే అప్పు క్లియర్ చేస్తూపోతే, ఏడెనిమిదేళ్ళకైనా ఇల్లు మా స్వంతం అవుతుంది. ఆలోచించండి- అన్నాను. మనకున్న ప్లాట్‌ని దృష్టిలో పెట్టుకొని. అసలా ప్లాటే లేకుంటే ఈ ఆలోచన వచ్చేది కాదులే.''

''అబ్బా ఎన్నాళ్ళకు ఓ మంచి ఐడియా వచ్చిందండీ. ఎంతైనా బట్టతలొచ్చాక మీకు కాస్త మంచి ఆలోచనొస్తున్నాయ్'' అంది ప్రేమగా అతని బట్టతల నిమురుతూ. నవ్వేశాడు కార్తీక్.

''రెండు గదులు వేయాలన్నా ఎంతలేదన్నా లక్ష రూపాయలవుతుంది. తెలుసా అన్నాడు. మిమ్మల్ని నమ్ముకొని ఇరవై ఏళ్ళుగా పనిచేస్తున్నది అవసరానికి ఆదుకొంటారనేగా. ఇప్పుడు లోన్ తీసుకోడం ద్వారా మరో ఏడెనిమిదేళ్ళు ఇక్కడే తప్పనిసరిగా పనిచేస్తానని బాండ్ రాసిచ్చినట్లేగా'' అన్నాను. అందుకాయన ఓ కండిషన్ పెట్టాడు.

''ఏంటది''ఆసక్తిగా అడిగింది దీపిక.

''తనిచ్చే లక్షలో ఓ యాభైవేలు వడ్డీలేకుండా, మరో యాభైవేలు ఏడాదికి పద్దెనిమిది పర్సెంట్ వడ్డీ చొప్పున అని. సరే అన్నాను.'' అన్నాడు కార్తీక్.

''అప్పుతీరుస్తూ-వడ్డీ ఎలా కడతారు?'' ఆలోచనగా అడిగింది దీపిక.

''ఏముంది నెలకు పదిహేనొందలు అప్పు తీరుస్తుంటాను-నాకొచ్చే బోనస్‌కి, బాలెన్స్ ఎంతుందో కల్పి-వడ్డీ ఏడాదికోసారి కడ్తుంటాను. ఎటొచ్చి చేతిలో వెయ్యి రూపాయలు మాత్రం మిగుల్తాయి. నేను రెండొందలు నా ఖర్చులకుంచుకొని, ఎనిమిది వందలు నీకిస్తుంటాను. దానికి నువ్వు నీ జీతం కలిపి వాడవలసి వస్తుంది మరి-ఆలోచించుకో'' అన్నాడు.

ఆడదాని సొమ్ము వాడటం నా పాలసీకే విరుద్ధం అంటూ దీపికని చాలా ఏళ్ళు ఉద్యోగం చేయనివ్వలేదు కార్తీక్. పిల్లలు ఎదిగాక ఇంట్లో గోళ్ళు గిల్లుకొంటూ కూర్చోవడం ఎందుకంటూ పట్టుబట్టి తన ఫ్రెండ్ మాధవి సహాయంతో జాబ్‌లో చేరింది దీపిక. వచ్చిన ఆమె జీతమెంతో, దాన్నేం చేస్తుందో ఏనాడూ అడగలేదు కార్తీక్. కానీ దీపికే ''ఏవండీ-ఈనెల వాటర్

ఫిల్టర్ కొన్నాననో, పాపకి బంగారు కమ్మలు చేయించాననో, మైసూర్ సిల్క్ శారీ కొనుక్కొన్నా ననో -పిల్లలకు బట్టలు తీసుకొన్నాననో చెబితే-ఊ .కొట్టేవాడు. తన డబ్బు ఇంటికి వాడకపోవటం తనని 'పరాయిగా' చూడటమేగా అని కొద్దిగా బాధపడే దీపికకి, కార్తీక్ ఇలా తన జీతాన్ని ఇంట్లో వాడమని చెప్పడంతో ఆ బాధపోయి-సంతోషం కల్గింది.

''ఇందులో ఆలోచించడానికేముంది'' అంది ఆనందంగా.

ఇద్దరూ కూర్చొని ఇంటి లెక్కలు వేశారు. తమకి వచ్చేదాంతో ఎలాగోలా ఇంటి ఖర్చు గడుస్తుందన్న నమ్మకం కల్గింది. దాంతో ఇల్లెలా కట్టాలో, ఎన్ని గదులుండాలి? ఎన్ని కిటికీలుండాలి, ఏ మూల షెల్ఫ్ వుండాలి అంటూ ఇంటి కట్టడం గురించిన మాటల్లో మునిగిపోయారు. మొత్తానికి ఇంటి టాపిక్‌తో, ఎంత పొదుపు చేయాలో మొదలగు చర్చలతోపాటు ఇంటి ప్లాన్ గురించి మాట్లాడుకోవటంతో రోజుకన్నా ఓ గంట ఆలస్యంగానే నిద్రపోయేవారు. పిల్లలకైతే ఎక్కడ్లేని సంబరం. ''నాన్నా నాకో గది స్పెషల్‌గా కావాలి.'' అని మురళి అడిగితే, ''నీకేనేంటి? నాకూ కావాలి'' అంటూ రవళి పేచి.. ''మీకిద్దరికి రెండు గదులు సరేనా- నేనూ మీ అమ్మా ఎంచక్కా కిచెన్ రూంలో'' అని కార్తీక్ అంటే, దీపిక గట్టిగా గిల్లేది.

బ్యాంక్‌లో ఎంతుందో లెక్కచూస్తే-ఇరవై రెండు వేలు తేలాయి. దాంతో బేస్‌మెంట్-బోరింగ్ పనుల య్యాయి. నెలరోజులు లీవ్‌పెట్టి, ఇల్లు దగ్గరుండి కట్టించడంలో నిమగ్నమయ్యాడు కార్తీక్. నెలను కొన్నది రెండు నెలలపైనే అయినా, ఇసుకవాడు, ఇటు కవాడు సతాయించినా, మేస్త్రీలు నసపెట్టినా- అన్ని ఇబ్బందుల్ని భరిస్తూ-ఇల్లు కట్టసాగారు. ముస్తా బవుతోన్న ఇంటిని చూస్తున్నప్పుడల్లా 'మేడంటే మేడా కాదు-గూడంటే గూడూ కాదు-పదిలంగా అల్లుకొన్న పొదరిల్లూ మాది'' పాటే మనసులో మెదిలేది కార్తీక్-దీపలకు.

మొత్తానికి ఇల్లు కట్టడం, సున్నాలేయడం, తలుపులకి కిటికీలకు రంగులేయడం జరిగాయి.

''ఏవండీ! డబ్బంతా ఖర్చయిపోయింది. గృహప్రవేశపు ఖర్చు మాటేంటి'' దిగులుగా అడిగింది దీపిక.

''పెద్దగా ఖర్చేముంటుంది. మన పిల్లల బర్త్‌డేలు ఎలా చేస్తామో అలాగే చేద్దాం- ఆడంబరంగా ఎందుకు?'' అన్నాడు తేలిగ్గా కార్తీక్.

''అదేంటలా అంటారు? అదీ ఇదీ ఒకటెలా అవుతుంది. పెళ్ళి ఖర్చెలాగో-ఇంటి ఖర్చూ అంతే అంటారు. పెళ్ళి గుచుప్‌గా చేయంగా. నలుగుర్ని పిలిచి నట్టింట్లో భోజనం పెట్టుకోకుండా వట్టి చేతులతో ఎలా పంపుతాం? గృహప్రవేశపు తంతు ఎలాగూ వేరే ఉంటుంది కదా'' అవుదూడల్ని తీసుకొచ్చి ఇంట్లో తిప్పాలి. గడప గడపకూ కొబ్బరికాయకొట్టి పూజించాలి. మనం దేవుడిపటాలతో ఇంట్లోకి నవ్వుతూ తుళ్ళుతూ ఆనందంగా అడుగుపెట్టాలి. ఆడబడుచు నీళ్ళ బిందెతో కాలు పెట్టాలి. అటు పెద్దలకు-ఇటు పెద్దలకు దగ్గరివారికీ బట్టలు పెట్టాలి.



సత్యనారాయణస్వామి వ్రతం చేసుకోవాలి. ఇంకా... ఏదో చెప్పబోతున్న దీపికను వారిస్తూ...

''తల్లీ! అంతా అలాగే చేయాలన్న రూలేం లేదు. ఎవరి శక్త్యానుసారం వారు చేసుకోవచ్చు. నా మనసులో ఏవిధంగా 'గృహప్రవేశం' చేయాలో ఆలోచించి పెట్టుకొన్నాను. దాని ప్రకారమే జరగాలి'' అన్నాడు.

తన మాటకామెదురాడ నీయకుండా, ఖచ్చితంగా.

కార్తీక్ మనసులోకి ఏదన్నా ఆలోచనవస్తే ఇకదాని ప్రకారమే ఫాలో అవుతాడు. ఆలోచించడంలో కాస్త జాగ్రత్త వహించాలి అంటే అంటాడు. అతడి సంగతి తెలిసింది కావటంతో-ఇక ఏమీ అనలేక అయోమయంగా తలూపింది దీపిక.

మావిడాకులు తోరణం కట్టిన తలుపులకి, మధ్యగా ఎర్రటి శాటిన్ రిబ్బన్ వచ్చేలా అటుగోడకి-ఇటుగోడకి మేకులుగొట్టి ఉంచాడు కార్తీక్ గిఫ్ట్ పాకెట్‌కిమల్లే.

ఆహుతులందరూ వచ్చారు. బాజా భజంత్రీలు లేవు. బ్రాహ్మడొచ్చి జరిపే పూజలు-అసలేటువంటి హడావుడి లేదు. అసలెలా గృహప్రవేశం చేస్తారంటూ ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డారు ఇరుగుపొరుగులు.

''రవళీ-ఇలా రా తల్లీ'' అంటూ కార్తీక్ పిలిస్తే- ''ఓహో కన్నకూతురితో రిబ్బన్ కట్ చేయిస్తాడులా ఉంది'' అనుకొన్నారు కొందరు.

రవళి చేతికి చిన్నస్టీల్ కత్తెర ఇచ్చి పట్టుకోమన్నాడు. కార్తీక్-ఆ తర్వాత ఆహుతులలో ఉన్న మాధవిని పిలుస్తూ ''మాధవిగారూ మీరిలా వచ్చి రిబ్బన్ కట్

చేసి, లోపలికి మీరే కాలుపెట్టండి ప్లీజ్'' అంటూ పిలిచాడు. ఉలిక్కిపడింది మాధవి. అయోమయంగా దీపికవంక చూసింది.

''వెళ్ళవే-వెళ్ళి రిబ్బన్ కట్ చేయి''అంటూ ప్రేమగా తన ప్రియ స్నేహితురాలిని ముందుకు తోసింది దీపిక.

బిడియపడుతూ వెళ్ళి రిబ్బన్ కట్ చేసింది మాధవి. అందరూ ఒక్కసారిగా చప్పట్లు కొట్టారు. వెంటనే బైట టేబుల్ మీద అరేంజ్ చేసి ఉంచిన టేప్ రికార్డర్‌ని ఆన్ చేశాడు కార్తీక్-మంగళవాయిద్యాల కాసెట్ ఉండటంతో శుభప్రదంగా మంగళారావాలుతో నిండిపోయింది.

అందరూ లోపలికి వెళ్ళారు.

అంతకుముందే కిచెన్‌లో-మిగతా గదులలో ఎక్కడి సామాను అక్కడ సర్దించి ఉంచడంతో-వారెప్పట్నుండో ఆ ఇంట్లో వుంటున్న ఫీలింగ్ కల్గింది చూసేవారికి.

''బలే చేశావోయ్-మీ ఆవిడ ఇల్లంతా సర్ది అలిసిపోయే పని లేకుండా'' అంటూ మెచ్చుకొన్నారు కార్తీక్ స్నేహితులు.

ఈలోగా కేటరింగ్ వాళ్ళొచ్చారు. బైటవేసిన శామియానా పందిరిక్రింద ఏర్పాటు చేసిన టేబుల్స్‌పై వడ్డనలు జరిగాయి.

''అదృష్టవంతురాలివే దీపికా, కాటరింగ్ వాళ్ళ ఏర్పాటున్నల్ల వండి-వడ్డించే శ్రమ తప్పింది. కొత్తిల్లు సర్దుకోడం-అలసిపోడం లేకుండా, వచ్చిన వారందర్నీ చిరునవ్వుతో రిసీవ్ చేసుకొనేలా మీవారు చేసిన ఈ ఏర్పాటు చాలా బావుంది'' అని దీపిక స్నేహితురాళ్ళు-మనస్ఫూర్తిగా అభినందించారు.

''మేము కూడా మా ఇంటి గృహప్రవేశం ఇలాగే చేస్తాం'' అప్పటికప్పుడే తన నిర్ణయాన్ని ప్రకటించే శాడు కొత్తగా ఇల్లు కడ్తున్న రమేష్.

''ఇంతకీ మాధవిగారి చేతనే రిబ్బన్ కత్తిరిం చడంలో ఆంతర్యమేంటండి'' అంటూ అడిగేసిం ది-వారి పొరుగింట్లోనే ఉంటున్న శారద. ఆమెకు అవతలివాళ్ళ విషయాలన్నీ వివరంగా తెలుసుకోవా లన్న ఆసక్తి ఎక్కువ.

''మాధవి నాకు దేవుడిచ్చిన చెల్లెలు. నా రక్తం పంచుకొని పుట్టకపోయినా-అంతకంటె ఎక్కువ. నిజానికి ఆమె నా భార్య స్నేహితురాలే అయినా నాకు మాత్రం ఆ భగవంతుడు ప్రసాదించిన చెల్లెలు. ఆమె చేసిన సహాయం వల్లనే మేమీనాడు-ఇలా ఈ ఇంట్లో మీ అందరితో సంతోషం పంచుకొనే అవకాశం కల్గింది. ఆమె పుణ్యమాని ఈ స్థలం ఐదేళ్ళక్రితం కొన్నాం. తన పెళ్ళికోసమని దాచుకొన్న ఎమౌంట్‌లో నుండి తీసిచ్చింది. మళ్ళీ మేం తిరిగి ఇవ్వబోయినా సున్నితంగా తిరస్క రించింది. కేవలం చేబదులు అడిగితేనే లోకువగా చూస్తారు కొందరు. అది తిరిగిచ్చేదాకా పదే పదే గుర్తుచేస్తారు. అలాంటిది తిరిగి ఆశించకుండా ''చవ కలో స్థలం వుంది- కొనేందుకు పదివేలు తక్కువ పడ్డాయని మేమనుకోగానే'' డబ్బు పట్టుకొచ్చి ఇచ్చింది. నా ఒక్కడి జీతంతో ఇల్లు నడవడం కష్టంగా ఉందని, దీపికకు వాళ్ళకు తెల్సినవాళ్ళకి చెప్పి జాబ్ ఇప్పించింది. ఇక మాపిల్లల కిచ్చే బహుమతులకంతే లేదు. మాధవికి-ఆమె భర్త శేఖర్‌కి మేమెంతో ఋణపడి ఉన్నాం. పూర్వజన్మ సుకృతం వల్లనే మాకు వీళ్ళు స్నేహితులుగా లభించారు. 'సొంతలాభం కొంతమానుకొని-పొరుగువాడికి తోడుపడవోయ్' అన్న సిద్ధాంతాన్ని నమ్మి ఆచరిస్తున్న ఈ జంట నుండి మనమంతా ఎంతోకొంత స్ఫూర్తిని పొందితే దేశసేవ చేసినట్లే'' అన్నాడు ఉద్వేగంగా కార్తీక్.

''చాల్లెండి పొగడ్తలు'' సున్నితంగా వారించింది మాధవి.

''నేను పరాయిరాష్ట్రంలో ఉన్నపుడు అక్కడి ఇరుగుపొరుగువారు చూపించిన ప్రేమానురాగాలే, నన్ను ఇలా పొరుగువారికి తోడ్పడమని ఉద్బోధించాయ్. అందుకు తగిన ఇల్లాలు దొరకడం నా నిజమయిన అదృష్టం.'' అన్నాడు శేఖర్ తన భార్య మాధవి వంక చూస్తూ.

నవ్వుతూ దీపిక చప్పట్లు కొట్టగానే, వచ్చినవారూ ఆనందంతో చప్పట్లు కొట్టారు. ''మీరంతాగూడా ఇలా ఇరుగుపొరుగువారితో సామరస్యంగా ఉంటేనే మమ్మల్ని నిజంగా అభినందించినట్లు''అన్నాడు శేఖర్.

అలా నవ్వుల పువ్వుల మధ్య వారి గృహప్రవేశం జరిగింది, వినూత్నంగా.

★★★

ఎక్కడివారక్కడ చేరాక, అంతా సర్దుకొనే సరికి రాత్రి పదకొండయింది.

''కొత్త ఇంట్లో మన మొదటిరాత్రి కదూ-దీపికను దగ్గరికి తీసుకొంటూ అన్నాడు కార్తీక్.

''అవును-మీకు మనస్ఫూర్తిగా థాంక్స్ చెబుతున్నాను మొదటిసారిగా'' అంది దీపిక.

''ఇదేంటి కొత్తగా-ఇన్నాళ్ళు లేనిది'' ఆశ్చర్యంగా అడిగాడు కార్తీక్.

''ఎప్పుడూ నోరువిప్పి చెప్పకపోయినా మా మాధవి పట్ల మీరంత అభిమానం కృతజ్ఞత చూపిస్తే నాకెంత ఆనందం కల్గిందో తెలుసా-''నేనింకా రిబ్బన్ కటింగ్‌కి మీ ప్రొప్రయిటర్‌ని పిలుస్తారనుకొన్నాను. అలా కాకుండా మాధవికా గౌరవం కల్గచేయడం అంతేకాక నేను ఆ దంపతులకు బట్టలు పెట్టినపుడు మీరు వాళ్ళకి గోల్డెన్‌రింగ్ ప్రెజెంట్ చేయడం కూడా మావాళ్ళందరికీ ఎంతో నచ్చింది.''

''దీపూ-మనం పెట్టిన బట్టలు-ఆ ఉంగరమూ వాళ్ళు మనపై చూపించిన అభిమానంలో ఎంతని? మనకొచ్చే జీతంలో మనం తినగా మిగిల్తే-రేపటికోసం దాచుకొంటామేతప్ప-ఎంత అవసరంలో ఉన్నా ఎవరికీ దానం చేయం. మనకో 'నిలువనీడ' నాశించి తన పెళ్ళికని దాచుకొన్న డబ్బునుండి, తిరిగి ఆశించకుండా అంతడబ్బు నీయడం, ఎంత పెద్దమనసుంటే సాధ్యం? అందుకే ఆమె నా మనసులో ఓ అపురూపవ్యక్తిగా, మహోన్నతంగా నిలిచిపోయింది. ఇక మా ప్రొప్రయిటర్ అంటావా? ఆయన రోజుకి లక్షలు కళ్ళ జూసే వ్యక్తే అయినా, 'అప్పుగా' మాత్రమే నాకు డబ్బు ఇచ్చాడు. అందులో ఆయన స్వార్థం కూడా ఉంది. మున్ముందు నా కష్టాన్ని-సేవలని ఆశించి మాత్రమే ఇచ్చాడు. మనల్ని 'పరాయి'గా తలచక, స్వంత బంధువుల్లా భావించిన మాధవిని అభిమానించడం మనిషిగా నా కనీస కర్తవ్యం కదా.'' అన్నాడు కార్తీక్.

చేసిన మేలును మరిచే కృతఘ్నుడిలా కాక, మానవత్వం ఇంగితం మూర్తీభవించిన కార్తీక్‌ని ప్రేమగా అల్లుకుపోయింది దీపిక. తమకున్నంతలోనే, అవస రంలో ఉన్నవారికి అంతో -ఇంతో సాయం చేయాలని మనస్సులో అనుకొంటూ.

ఇన్నాళ్ళు దేవుడంటే నమ్మకం లేదీ మనిషికి అనుకొనేది తను. అలాంటిది దేవుడిమీద ఆయనకి కొత్తగా కల్గిన విశ్వాసం 'దేవుడిచ్చిన చెల్లే ఈ మాధవి' అని చెప్పడంలో తెలిసిపోయింది' అనుకొంది తృప్తిగా. ★



## కావ్య పెళ్లి?

ఎలా పుట్టుకొచ్చిందో తెలీదుగానీ కళ్యాణప్రాప్తిరస్తు, రౌడీ దర్బార్ తదితర చిత్రాలలో నటించిన కావ్యను ఓ ప్రముఖ దర్శకుడు పెళ్లి చేసుకున్నాడన్న వార్త పున్నట్టుండి ఇండస్ట్రీలో గుప్పుమంది. ఆ ప్రముఖ దర్శకుడు ఓ వర్ధమాన నటిని పెళ్లిచేసుకునే పొరపాటు ఎప్పుడూ చేయడని ఆయన గురించి తెలిసినవాళ్లు వెంటనే ఖండించారు. ఆ తర్వాత విచారిస్తే ఎవరు సృష్టించారోగానీ అది వట్టి పుకారేనని తేలిపోయింది. అయితే ఒకటి మాత్రం నిజమట! కావ్య కెరీర్‌ని ఆ ప్రముఖుడే 'డైరెక్ట్' చేస్తున్నాట్ట. ఇలాంటి అండదండలువున్నా కూడా కావ్యకి అవకాశాలు రావడం మాత్రం కష్టంగానే వుంది. 'ఆవారాగాడు' చిత్రమైనా ఆమెకి మరికొన్ని అవకాశాల్ని తీసుకొస్తుందో లేదో వేచి చూడాల్సిందే!

-జె.వి.బాబు